## అంబేద్కర్ దార్శనికతతో తెలంగాణ

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



ఇల్లంతకుంట: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 14: అంబేద్కర్ దార్శనికతతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ అందరివాడు అని అన్నారు. ఆయన ఆశయాలను భవిష్యత్‌తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనతరం మండల కేంద్రంలో పలువురిని పరామర్శించారు. మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ చిట్టి కిషన్‌రెడ్డి నూతన గృహప్రవేశానికి హాజరయ్యారు. ఇక్కడ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, గొట్టెపర్తి పరశురాం, సాదుల్, మీసరగండ్ల అనిల్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు తడుకపెల్లి భూమయ్య, పసుల వెంకటి, లింగం, రాజేశం, రాకేశ్, శంకర్ ఉన్నారు.

## రాజ్యాంగంతోనే అందరికీ సంక్షేమ ఫలాలు : మాజీ ఎమ్మెల్యే సుంకె



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి రూరల్, ఏప్రిల్ 14: రాజ్యాంగంతోనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భంచిందని, అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంతోపాటు తడగొండలోని ప్రధాన కూడళ్లలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, ఎంపీడీవో జయశీల, ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు

### తెలంగాణ భవన్‌లో..

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 14: జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు స్థానిక అంబేద్కర్‌చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించి, మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ జిందం కళ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, మ్యాన రవి, సత్తార్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# మహనీయుడు అంబేద్కర్



వేములవాడ రూరల్ : అంబేద్కర్‌కు పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, అంబేద్కర్, దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి అంబేద్కర్ అందించిన సేవలను వారు కొనియాడారు. సామాజిక వివక్షతను జయించి.. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ప్రతిఒక్కరూ బాబాసాహెబ్‌ను ఆదర్శంగా తీసుకుని.. ఆయన అడుగుజాడల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.**

- జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలు
- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు

వేములవాడ రూరల్ /ముస్తాబాద్/ గంభీరావుపేట/ ఎల్లారెడ్డిపేట/ కోనరావుపేట/రుద్రంగి/ వీర్నపల్లి /గాంధీచౌక్, ఏప్రిల్ 14: పలు మండలాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేడుకల్లో గంభీరావుపేట ఏఎంసీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయలక్ష్మి, కోనరావుపేటలో సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, ముస్తాబాద్‌లో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఏఎంసీ చెర్‌పర్సన్ తలారి రాణి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, మాజీ ఎంపీపీ, రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు అక్క రాజు శ్రీనివాస్, వీర్నపల్లిలో సెస్ డైరెక్టర్ మల్లేశం, బంజారా సంఘం జిల్లా అధ్యడు గుగులోత్ సురేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు. వేములవాడ రూరల్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గొస్కుల రవి,మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, మాజీ సర్పంచ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మాధవి, పార్టీ నాయకులు



కోనరావుపేట: అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరైన నాయకులు, అధికారులు

## దేశసేవకు అంకితం కావాలి : ఎస్పీ



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ మహేశ్ బీ గితె, సిబ్బంది

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): మహనీయుల స్ఫూర్తితో దేశ సేవకు అంకితం కావాలని ఎస్పీ మహేశ్ బీ గితె పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన ఘన నివాళులర్పించారు. అంబేద్కర్ జీవితం, బోధనల నుంచి ప్రేరణ పొందిన ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు.



ముస్తాబాద్: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

## ఎస్సీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి కృషి: విప్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): ఎస్సీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి సిరిసిల్ల నియోజకవర్గంలో ఎకరం స్థలం కేటాయించడంతో పాటు నిధులు మంజూరుకు తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీఇచ్చారు. అంబేద్కర్ జయంతోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బి గితే, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, బీసీ సంక్షేమశాఖ అధికారి రాజమనోహర్ రావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సమయ్య, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే సిరిసిల్ల న్యాయవాదుల సంఘ కార్యాల యంలో అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాసరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**వేములవాడలో కాంస్య విగ్రహావిష్కరణ**

వేములవాడ, ఏప్రిల్ 14: వేములవాడ పట్టణంలో రూ.30లక్షలతో అంబేద్కర్ జంక్షన్ సుందరీకరించి ఏర్పాటు చేసిన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం ఆవిష్కరించారు. ఇక్కడ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బి గితే, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణ, ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, బీజేపీ నేత ప్రతాపరామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, నాయకులు సిరిగిరి రామచందర్, జోగిని శంకర్, కుమ్మరి శ్రీనివాస్, నరాల శేఖర్, మారం కుమార్, కొండ కనకయ్య, గోలి మహేశ్, రామతీర్థపు రాజు, ముద్రకోల వెంకటేశం, నీలం శేఖర్, వెంగళ శ్రీకాంత్, అంజత్‌పాషా, బత్తుల దేవరాజు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

## హత్య కేసులో సమగ్ర విచారణ

**సామాజిక మాధ్యమాల్లో వీడియోల పోస్ట్‌పై తీవ్ర ఆగ్రహం**

వేములవాడ, ఏప్రిల్ 14 : పట్టణంలో యువకులు హత్య చేసి సామాజిక మాధ్యమాల్లో వీడియోలను పెట్టడాన్ని పోలీస్ శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. ఆదివారం బింగి మహేశ్ ఫంక్షన్ హాల్ వద్ద పర్శరాం హత్య కేసులో పోలీసులు మరింత లోతైన విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. మాదకద్రవ్యాల వినియోగానికి అలవాటు పడిన యువకులు కిరాతకంగా వ్యవహరించిన తీరు వేములవాడ పట్టణంలో సంచలనం రేపింది. పర్శరాం ఉన్న చోటును తెలుసుకొని మారుణాయుధాలతో వచ్చి రావడమే తరువాయిగా హత్య చేసిన తీరు భయాందోళనకు తెరలేపింది. అయితే 25 ఏళ్ల వయసు లోపు ఉన్న యువకులు మాదక ద్రవ్యాల అలవాటు పడి కొంతకాలంగా ఉన్న విభేదాలతో హత్య చేసినట్లుగా భావిస్తున్నప్పటికీ యువత ప్రవర్తించిన తీరు పోలీస్ శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. జిల్లా పోలీస్ బాస్ సైతం వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి కూడా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ సామాజిక మాధ్యమాల్లో వీడియోలను పెట్టడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ మరింత లోతైన విచారణ చేస్తున్నారు. హత్య చేసిన తర్వాత మారణాయుధాలను చూపుతూ బెదిరింపు దూరానికి పాల్పడుతూ వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. యువకులకు నేర చరిత్ర కలిగినప్పటికీ హత్య చేసి వీడియోలను బయటకు విడుదల చేయడం దీని వెనుక ఎవరి పాత్ర ఉందనేది మాత్రం లోతుగా విచారణచేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇందులో మరికొంతమంది యువకులను అదుపులోకి తీసుకొని విచారించినట్లు సమాచారం.

## ఆకట్టుకున్న బాలనాగమ్మ నాటక ప్రదర్శన



కనగర్తిలో నాటక ప్రదర్శన చేస్తున్న కళాబృందం

కోనరావుపేట, ఏప్రిల్ 14 : మండలం కనగర్తిలో శ్రీ వేణుగోపాల స్వామి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుతల బాలనాగమ్మ నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంతరించిపోతున్న రంగస్థ నాటక ప్రదర్శనలు, కళలను కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. బాలనాగమ్మ ఇతివృత్తంతో చేసిన ఈ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కాసర్ల మల్లారెడ్డి, బీ శ్రీనివాస్ రెడ్డి, పోగులు రవీంద్రరెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో మాజీ చైర్మన్ గుండెపోటుతో మృతి

- కొండాపూర్‌లో విషాదం

కోనరావుపేట, ఏప్రిల్ 14 : మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన సింగిల్ విండో మాజీ చైర్మన్ కేతిరెడ్డి లక్ష్మారెడ్డి (52) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. రోజు మాదిరిగానే కుటుంబ సభ్యులతో రాత్రి భోజనం చేసి నిద్రించాడు. ఈ క్రమంలో ఉదయం నిద్ర లేచి బయటకు వెళ్లి వచ్చి నిద్రిస్తున్న తరుణంలో గుండెపోటు వచ్చింది. తన కూతురు వెళ్లి ఎంతలేపినా లేవలేదు. వెంటనే సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని తెలిపారు. ఇంటి పెద్ద మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. మృతుడికి భార్య మంజుల, కొడుకు భాగ్యరెడ్డి, కూ తురు కీర్తిరెడ్డి ఉన్నారు. ఇది ఇలా ఉండగా ఈ నెల 30న కొడుకు భాగ్యరెడ్డి నిశ్చితార్థం ఉండగా, లక్ష్మారెడ్డి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్ష్మారెడ్డి రాజకీయంగా మంచి పేరు పఖ్యాతలు ఉండడంతో పాటు కోనరావుపేట సింగిల్ విండో చైర్మన్‌గా, గ్రామ ఉపసర్పంచ్‌గా ప్రజలకు సేవలందించాడు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు లక్ష్మారెడ్డి మృతుదేహానికి పలువురు ప్ర జాప్రతినిధులు నివాళుర్పించారు. ప్రభు త్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్ల య్య, వైస్‌చైర్మన్లు అనుపాటి భూంరెడ్డి, తాళ్లపల్లి ప్రభాకర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు పాషా, దేవయ్య అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



లక్ష్మారెడ్డి(ఫైల్)

## హైకోర్టు న్యాయమూర్తిని సన్మానించిన న్యాయవాదులు

వేములవాడ, ఏప్రిల్ 14 : రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుకారాంజీని సోమవారం ఆలయ అతిథిగృహంలో వేములవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించి సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు కటకం జనార్దన్, గుజ్జె మనోహర్, బొజ్జ మహేందర్, శ్రీనివాస్, మహేశ్, పద్మ, సరిత ఉన్నారు.



రాష్ట్ర హైకోర్టు జస్టిస్ తుకారాంజీని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ న్యాయవాదులు

## దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి

చందుర్తి, ఏప్రిల్ 14 : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి సూచించారు. సోమవారం మండలంలోని జోగాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏపీఎం రజిత, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, వైస్ చైర్మన్ మల్లేశం, డైరెక్టర్ సాయి, గ్రామస్తులు ఉన్నారు.

## నూతన నియామకం



నరహరి

రుద్రంగి, ఏప్రిల్ 14 : జాతీయ మానవ హక్కుల కమిటీ మండల చైర్మన్‌గా లావు డ్యా నరహరి నియామకమైనట్లు జల్లా చైర్మన్ మిల్లపల్లి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిటీ జాతీయ, రాష్ట్ర చైర్మన్ ఆదేశాల మేరకు మండల కమిటీలను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ, మండలంలో మానవ హక్కులను పరిరక్షించేందుకు కృషి చేస్తామన్నారు. జాతీయ మానవ హక్కుల కమిటీ, రాష్ట్ర కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఇల్లంతకుంట రూరల్, ఏప్రిల్ 14 : మండలంలోని ముస్కుపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ముస్కు మల్లయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మల్లయ్యను పరామర్శించారు. ఆయన వెంట జడ్పీ మాజీ వైస్‌వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, చీర్లవంచ మాజీ సర్పంచ్ జక్కుల రవీందర్ తదితరులు ఉన్నారు.

## గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 14: ఫాజుల్‌నగర్ గ్రామంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మారుతి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మారుతి మాట్లాడుతూ జగిత్యాల జిల్లాకు చెందిన రాకేశ్, సాయికిరణ్, బీహార్‌కు చెందిన సునీల్ దాదాపు 100 గ్రాముల గంజాయి తరలిస్తుండగా, పట్టుకున్నట్లు తెలిపారు. వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అంబేద్కర్ సంఘ సభ్యులకు డప్పుల వితరణ

గంభీరావుపేట, ఏప్రిల్ 14 : మండలంలోని గోరంటాల మాజీ సర్పంచ్ కొలుముల అంజమ్మ సోమవారం గ్రామ అంబేద్కర్ సంఘ సభ్యులకు 10 డప్పులను వితరణగా అందజేశారు. అంజ మ్మ–బాల్‌రెడ్డిల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వారికి డప్పులు అందజేశారు.

## ఆర్థిక సాయం అందజేత

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 14: సిరిసిల్ల పట్టణంలోని జడ్పీహెస్‌లో అవుట్ సోర్సింగ్ విభాగంలో ఒకేషనల్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తూ మరణించిన బందారపు నవీన్‌కుమార్ కుటుంబాన్ని సోమవారం పీఆర్టీయూటీఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు పీఆర్టీయూటీఎస్ మాజీ అసోసియేట్ అధ్యక్షుడు వంగ మహేందర్ రెడ్డి చేతుల మీదుగా రూ.లక్ష చెక్‌ను అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, హజునాయక్, బూర్ల సత్యనారాయణ, తదితరులున్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): పట్టణంలోని పేకాట స్థావరాలపై సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1,30, 930 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. విద్యానగర్‌లోని అక్కరాజు శ్రీనివాస్ నివాసంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు.. పట్టణంలోని విద్యానగర్‌లోని శ్రీనివాస్ నివాసంలో తనికీ చేయగా, వారిని అదుపులోకి తీసుకొని కేసునమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

## 'బడిబాట' కరపత్రం ఆవిష్కరణ

కథలాపూర్, ఏప్రిల్ 14: అంబారిపేట ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో రూపొందించిన 'బడిబాట' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని సోమవారం జగిత్యాలలో డీఈవో రాము ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, అందిస్తున్న విద్య, సాంస్కృతిక కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాన్ని ఉపాధ్యాయులు తయారు చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు డీఈవో రాము సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బచ్చు సృజన, ఉపాధ్యాయులు కరుణాకర్, అనూష పాల్గొన్నారు.



బడిబాట కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో రాము, ఉపాధ్యాయులు

## రాజన్న దేవస్థాన విస్తరణలో అనువంశిక అర్చకుల సహకారం తీసుకుంటాం

వేములవాడ టౌన్ , ఏప్రిల్ 14 : వేములవాడ రాజన్న క్షేత్రాన్ని యాదగిరిగుట్టలాగా విస్తరిస్తున్న దశలో రాజన్న ఆలయ అనువంశిక అర్చక ప్రతినిధులు, వేదపండితులు, ఆగమశాస్త్ర నిపుణుల సలహాలను తీసుకుంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌హామీ ఇచ్చారు. ఆలయ అనువంశిక ట్రస్ట్ అధ్యక్షుడైన ప్రతాప రామకృష్ణ ఇచ్చిన సమాచారం మేరకు.. తాను ఈ నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. ముందుగా వేములవాడ గుడి ఎదుట అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వేములవాడ టెంపుల్ డెవల ప్ మెంట్ అథారిటీ కార్యదర్శిగా నియామకయ్యారన్నారు. సుమారు రూ.150 కోట్ల బడ్జెట్‌తో వేములవాడ ఆలయ విస్తరణ పనులు కొనసాగిస్తామన్నారు. ఈ కార్య క్రమాల్లో భాగంగా నేడు ఉన్నతాధికారుల సమావేశం ఉందన్నారు. శృంగేరి పీఠాధి పతుల ఆమోదం, వివిధ ఆగమ సంస్థలు, అనువంశిక అర్చకుల భాగస్వామ్యంతోనే ఆలయ విస్తరణ పనులను చేపడుతామన్నారు. రాజన్న ఆలయంలో ఖాళీలుగా ఉన్న అర్చక పోస్టులను అర్హులైన అనువంశిక అర్చక పురోహితులతో భర్తీ చేయాలని అను వంశిక అర్చక ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

### మోరపెల్లిలో పిచ్చికుక్కల స్వైర విహారం

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 14: జగిత్యాల రూరల్ మండలం మోరపెల్లి గ్రామంలో సోమవారం పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. పది మందిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. అధికారులు స్పందించి పిచ్చికుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆటో బోల్తా పడి మహిళా కూలీలకు గాయాలు

- డ్రైవర్ పరిస్థితి విషమం

శంకరపట్నం, ఏప్రిల్ 14: మండలంలోని ఆముదాలపల్లిలో మహిళా కూలీలతో వెళ్తున్న ఓ ప్యాసింజర్ ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ సహా ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. రాజాపూర్ ఎస్సీ కాలనీకి చెందిన కనకం అంజయ్య రోజూ తన ప్యాసింజర్ ఆటోలో వ్యవసాయ పనులకు మహిళా కూలీలను తీసుకెళ్తాడు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం అంజయ్య తన ఆటోలో తమ కాలనీకే చెందిన మహిళా కూలీలను వీణవంక మండలం కాపులపల్లికి మక్క కంకి తీయడానికి తీసుకెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఇళ్లకు తిరిగి వస్తుండగా ఆటో ఆముదాలపల్లి శివారులోని వంతెన వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పి వంతెన కింద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు ఆయన భార్య సారమ్మ, కోడుళ్లు నందిని, సంగీత, కుక్కమూడి వీరయ్య, అతడి భార్య ఎల్లమ్మ, అలాగే మాతంగి మధునమ్మ, మాతంగి శంకరమ్మ గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న క్షతగాత్రుల కుటుంబ సభ్యులు వెంటనే ప్రైవేట్ వాహనాల్లో జమ్మికుంట, హుజూరాబాద్ దవాఖానలకు తరలించారు. వీరిలో ఆటో డ్రైవర్ అంజయ్యతో పాటు మధునమ్మ, శంకరమ్మకు తీవ్ర గాయాలు కాగా, హుజూరాబాద్ నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. వీరిలో అంజయ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఘటనా స్థలాన్ని కేశవపట్నం పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**పాస్‌పోర్ట్ పోయినది**

నేను, గుంజి మల్లికార్జున్ S/o. గుంజి రమణయ్య H.No. 1-8-10/1, ఆదర్శనగర్ మెట్‌పల్లి టౌన్ మరియు మండలం జగిత్యాల జిల్లా, నా పాస్‌పోర్ట్ నెం. P6900458 హైదరాబాద్ నుంచి మెట్‌పల్లికి బస్సులో వెళ్తున్నప్పుడు పోయింది. ఒక వేళ ఎవరికైనా దొరికినట్లయితే దయచేసి కాల్ చేయండి. సెల్ : 9985273703

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189